క్లుప్తంగా

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



అడ్డాకుల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం ఆశావర్కర్లు ఆందోళన నిర్వహించారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, పెన్షన్, బీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఆశావర్కర్లకు సంబంధించిన సమస్యలపై స్థానిక మెడికల్ ఆఫీసర్ ఆయేషాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీదేవి, హైమావతి, శశికళ, పద్మ, లక్ష్మి, శ్యామల, ప్రవళిక, మంజుల, కృష్ణవేణి, రాధ, జ్యోతి ఉన్నారు.

ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం..

నవాబుపేట: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు వెట్టి చేయించుకుని కనీస సౌకర్యాలు సైతం కల్పించటం లేదన్నారు. అనంతరం మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకురాలు నిర్మల, పద్మ, బాగ్య, లక్ష్మీదేవి, స్వరూప, మహేశ్వరి ఉన్నారు.

ఓయూ విద్యార్థులపై ఆంక్షలు ఎత్తివేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులపై అధికారులు ఆంక్షలు ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పీయూలో నిరసన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల స్వేచ్ఛకు వ్యతిరేకంగా క్యాంపస్‌లో ఎటువంటి నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు చేపట్టవద్దని, అన్ని డిపార్ట్‌మెంట్‌ల హెచ్‌ఓడీలకు ఆదేశాలు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు నిరసన కార్యక్రమాలు చేపడితే, పోలీసులు అరెస్టు చేయడం దారుణమైన విషయమన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఓయూ విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమైందని, వాటిని దృష్టిలో ఉంచుకొని వెంటనే సర్కులర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాము, రాజేష్, సాయి, అభినవ్, సరిత, అరవింద్, బుగప్ప, శివ పాల్గొన్నారు.

కొనసాగుతున్న కందూర్ జాతర



అడ్డాకుల: మండలంలోని కందూర్ శివారులో స్వయంభూగా వెలిసిన శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం వద్ద జాతర కొనసాగుతోంది. ఈనెల 11న మొదలైన బ్రహ్మోత్సవాలు 16న ముగిశాయి. మరునటి రోజు నుంచి జాతర మొదలైంది. ఆలయ ఆవరణలో చిన్న పిల్లల ఆట వస్తువులు, మిఠాయి దుకాణాలు, గాజుల దుకాణాలు వెలిశాయి. ప్రతి రోజు అర్చకులు ప్రధాన ఆలయంలోని శివలింగానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు స్వామివారిని దర్శించుకుని వెళ్తున్నారు. ఉగాది పండుగ సమీపిస్తే జాతరకు భక్తజనం పోటెత్తనుంది. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు

కోయిల్‌కొండ: మండలంలో ఎన్ఆర్ఈజీఎస్, ఎస్సీ సబ్‌ప్లాన్ కింద మంజూరైన సీసీరోడ్డు పనులు నాణ్యతతో చేపట్టాలని, లేకుంటే చర్యలు తప్పవని పంచాయతీరాజ్ ఈఈ నరేందర్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ యాదగిరి, కాంట్రాక్టర్లను హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని గార్లపహాడ్, గంగ్యానాయక్‌తండా, పారుపల్లి, బూర్గుపల్లి గ్రామాల్లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను వారు ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ వెంకటేష్ పాల్గొన్నారు.

‘ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి’

జడ్చర్ల టౌన్: ప్రపంచ అటవీ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని ఆలూరు జిల్లా పరిషత్ హైస్కూల్, ఎన్జీసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామ కూడళ్లలో తిరుగుతూ అడవి ప్రాధాన్యతను వివరించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ షరీఫ్ అడవుల ప్రయోజనాలను తెలియజేశారు. అడవుల శాతాన్ని పెంచుకోటానికి ప్రతిఒక్కరూ ఒక మొక్కపెంచాలన్నారు. కార్యక్రమంలో ఎన్జీసీ ఇన్‌చార్జి ఉపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అలీం, హరినాథ్, సోమజనాయక్, సంధ్య, హైమావతి, నిర్మల పాల్గొన్నారు.

ప్రారంభమైన ‘పది’ పరీక్షలు



చిన్నచింతకుంట పరీక్ష కేంద్రం వద్ద లోపలికి వెళ్తున్న విద్యార్థులు



నవాబుపేట మండలం యన్మన్‌గండ్ల పరీక్ష కేంద్రంలో విద్యార్థులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు ఉంటుందని అధికారులు తెలిపారు.

■ జడ్చర్ల మండలంలో మొత్తం 8 పరీక్ష కేంద్రాల్లో 1801 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 5మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 1796మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

■ మిడ్జిల్‌లోని ఏ సెంటర్లో 200 మందికి 200 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. బీ సెంటర్‌లో 145మందికి గాను 143మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

■ నవాబుపేటతో పాటు యన్మన్‌గండ్ల, కొల్లూర్ పాఠశాలలో పది పరీక్ష కేంద్రాలు నిర్వహించారు. మొత్తం 633మంది విద్యార్థులకు గాను అందరూ హాజరై పరీక్షలు రాశారు. మెదటి రోజు పరీక్ష కేంద్రాన్ని డివిజనల్ అబ్జర్వర్ నాగయ్యనాయక్ తనిఖీ చేశారు.

■ చిన్నచింతకుంట మండలంలోని పెద్దవడ్డేమాన్ చిన్నచింతకుంట గ్రామాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. చిన్నచింతకుంటలో 263 మంది విద్యార్థులకుగాను 262, పెద్దవడ్డేమాన్‌లో 210కిగాను 209 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరిక్ష కేంద్రాలను తహసీల్దార్ ఎల్లయ్య, ఎస్ఐ రాంలాల్ నాయక్ పరిశీలించారు.

■ దేవరకద్రలోని జెడ్పీ బాలికల, బాలుర, శ్రీవాణీ శిశుమందిర్ తో కలిపి మూడు పరీక్ష కేంద్రాల్లో 681 మంది విద్యార్థులకు గాను అందరూ పరీక్షకు హాజరయ్యారు. కౌకుంట్లలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 128 మంది విద్యార్థులకు గాను అందరు హాజరు అయ్యారు. దేవరకద్ర జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ కృష్ణయ్య తనిఖీ చేశారు.

■ అడ్డాకులలో 270 మంది విద్యార్థులకు గాను ఒకరు, మూసాపేట, జానంపేటలో కలిపి 359 మంది విద్యార్థులకు గాను ఒకరు గైర్హాజరయ్యారు.



బాదేపల్లి జెడ్పీహైస్కూల్‌లో..

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



భూత్పూర్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

భూత్పూర్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పరిశీలించారు. మండల కేంద్రంలో న్యూఎర ఉన్నత పాఠశాల సెంటర్‌లో 240 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 208 మంది పరీక్షలు రాశారు. విద్యార్థుల హాజరు, మండలంలోని ఎన్ని ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు పరీక్ష హాజరవుతున్న వివరాలు కలెక్టర్ విజయేందిర డిపార్ట్‌మెంటల్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయురాలు రేవతి ఉన్నారు.

రైతులకు అన్నివిధాలా సేవలందిస్తాం



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

దేవరకద్ర: రైతులకు అన్ని విధాల సేవలు అందించడానికి తమ వంతుగా కృషి చేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకద్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనంలో జరిగిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. ఎంఆర్‌పీ ధరలకే ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను సహకార సంఘం ద్వారా అందిస్తున్నామని అన్నారు. రైతుల సంక్షేమం కోసం పని చేసే సహకార వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి ప్రయత్నిస్తున్నామని దీనికి రైతులు కూడ సహకారం అందించాలని కోరారు. సహకార సంఘం ద్వారా రూ.95.12 లక్షల దీర్ఘకాలిక రుణాలు, రూ.4.69 కోట్ల పంట రుణాలు రైతులకు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం బడ్జెట్ ప్రతిపాదనలను చదివి సభలో ఆమోదించారు. సీఈఓ శ్రీనివాసులు, డైరెక్టర్లు నర్వశ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, రాజేందర్, ఎక్బాల్‌పాష, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కళాశాలలో ప్రపంచ కవి దినోత్సవం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ కవి దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆలోచనలను అక్షరబద్ధం చేసి, కవితకు ప్రాణంపోసే కవి నేటి కాలంలో ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నారని, అటువంటి వారు సామాజిక మార్పుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు కళ్యాణి, నర్సింహారావు, మధుసూదనశర్మ, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర రంజాన్ ఉపవాస దీక్ష ఉన్న ముస్లింలకు ఏర్పాటు చేసే ఇఫ్తార్ ఆత్మీయత, మతసామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త జఫరుల్లా సిద్దిఖీ జిల్లా కేంద్రంలోని జేజేఆర్ గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఉపవాస దీక్ష ఉన్న ముస్లింలకు ఎమ్మెల్యే ఫలహారాలు తినిపించారు. కాంగ్రెస్ నాయకులు ఎన్‌పీ.వెంకటేష్, ఎం.సురేందర్‌రెడ్డి, ఏపీ మిథున్‌రెడ్డితో జాకీర్ అడ్వకేట్, గౌస్ మొహియోద్దీన్, మక్సూద్, రఫీక్ పటేల్, మొయిన్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

జైలును పరిశీలించిన న్యాయమూర్తి

పాలమూరు: స్థానిక జిల్లా జైలును శుక్రవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర సందర్శించారు. జైలులో ఉన్న అన్ని రకాల వసతులను, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. మొదట కిచెన్‌లో ఖైదీలకు తయారు చేస్తున్న ఆహారం తనిఖీ చేశారు. ఆ తర్వాత జైలు బ్యారక్‌లలో ఉన్న ఖైదీలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఖైదీలకు బెయిల్ కోసం లీగల్ ఎయిడ్ న్యాయవాదులు కావాలంటే న్యాయ సేవాధికార సంస్థలో సంప్రదించాలన్నారు.

గ్రామీణ ప్రాంత సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం



ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాములు డిమాండ్ చేశారు. శుక్రవారం మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని మాచన్‌పల్లిలో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు, వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా ద్వారా రూ.12,500 ఇవ్వాలన్నారు. మట్టిరోడ్లను సీసీగా మార్చాలని, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, చేతివృత్తిదారులకు పింఛన్లు మంజూరు చేయాలన్నారు. ‘ఉపాధి హామీ’ పనులు సత్వరమే ప్రారంభించాలన్నారు. రైతుభరోసా, పంటల రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. ఈ డిమాండ్లను పరిష్కరించకుంటే వచ్చే నెల మొదటి వారంలో పార్టీ ఆధ్వర్యంలో ఆయా ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళనకు దిగుతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కడియాల మోహన్, మండల నాయకులు వి.హనుమంతు, భగవంతు, దున్న ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

దేవరకద్ర రూరల్: చౌదర్‌పల్లి సమీపంలోని స్విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం పోలీస్ విభాగంలోని షీటీం ద్వారా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ నాగన్న మాట్లాడుతూ నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో జాగ్రత్తతో మెలగడంతో వాటిని అదుపు చేయవచ్చన్నారు. సైబర్‌నేరాలు జరిగితే 1930కి ఫిర్యాదు చేయాలని, అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌పై షీటీమ్‌కు సమాచారం ఇవ్వాలని విద్యార్థినులకు సూచించారు. షీటీమ్ ఏఎస్ఐ వనజ, శిక్షణ ఎస్ఐ కృష్ణజీ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పాలమూరు యూనివర్సిటీలో భవన నిర్మాణంలో సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తూ కిందపడి మృతి చెందిన చుక్కని రమేశ్ కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వరద గాలెన్న డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా కార్మికుడు మృతి చెందినట్లు పేర్కొన్నారు.

విగ్రహాలు యథాస్థానంలో ప్రతిష్ఠించాలి

● కుదరని ఏకాభిప్రాయం



సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

జడ్చర్ల టౌన్: మహనీయులైన అంబేడ్కర్, జ్యోతిరావుపూలే. ఇందిరాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూల విగ్రహాలు రోడ్డు విస్తరణ అనంతరం యథాస్థానంలో ప్రతిష్ఠంచాలని ఆయా పార్టీ, సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. శుక్రవారంచంద్ర గార్డెన్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత ఆధ్వర్యంలో పార్టీలు, ప్రజా, కులసంఘాలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో చైర్‌పర్సన్‌తోపాటు కమిషనర్ లక్ష్మారెడ్డి, ఎన్‌హెచ్ అధికారులు రవికుమార్, చంద్రకాంత్‌రెడ్డి హాజరయ్యారు. రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నందున మహనీయుల విగ్రహాలు తొలగింపు అనివార్యమని చైర్‌పర్సన్, కమిషనర్ తెలిపారు. ఎన్‌హెచ్ అధికారులు రవికుమార్, చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ సిగ్నల్‌గడ్డ ప్రాంతం మొత్తం 1కి.మీ మేర విగ్రహాలు నెలకొల్పేందుకు అవకాశం లేదని, ఇపుడున్న విగ్రహాలు తొలగిస్తేనే పనులు వేగవంతం అవుతాయని వెల్లడించారు. రోడ్డు బీటీ పనులు ఒకవైపు పూర్తయినందున రెండోవైపు చేపడ్తామన్నారు. అందుకోసం విగ్రహాలను తరలించాలని వివరించారు. ఎన్‌హెచ్ నిబంధనల ప్రకారం మళ్లీ వాటిని యథాస్థానంలో ప్రతిష్ఠించేందుకు వీలు లేదని, వేరేచోట ప్రతిష్టిస్తే అందుకు అవసరమైన దిమ్మె నిర్మాణానికి అయ్యే వ్యయం ఉన్నతాధికారులతో మాట్లాడి మంజూరు చేయిస్తామని ప్రకటించారు. విగ్రహాలు తొలగించకుంటే పనులు ముందుకు సాగవని, తాము ఆ పనులు చేపట్టకుండా వదిలి వెళ్లాల్సి వస్తుందని వివరించారు. దీంతో విగ్రహాల తరలింపునకు అంగీకరించేది లేదని నాయకులు వెల్లడించటంతో ఏకాభిప్రాయం కుదరకపోవటంతో ఎన్‌హెచ్ అధికారులు వెళ్లిపోయారు.

క్రాంతి మహిళా సంఘం రద్దు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక శ్రీనివాసకాలనీలోని క్రాంతి మహిళా సంఘాన్ని రద్దు చేస్తున్నట్లు మెప్మా అధికారులు ప్రకటించడం తో తొమ్మిది మంది సభ్యులు లబోదిబోమంటున్నారు. దీనికి ఈ సంఘం అధ్యక్షురాలు దీపనే కారణమని చిట్టెమ్మ, మంగ, భారతి, కృష్ణవేణి, లక్ష్మి, నర్మద, అనూష (పద్మావతికాలని), పద్మ, అనూష (శ్రీనివాసకాలని) ఆరోపిస్తున్నారు. గతంలో స్త్రీనిధి నుంచి తమకు రావాల్సిన రుణం రూ.నాలుగు లక్షలు తానే తీసుకుందని వాపోయారు. అలాగే పొదుపు సంఘం నుంచి రూ.రెండు లక్షలు సైతం తీసుకుందన్నారు. ఈ విషయమై దీపను వివరణ కోరగా మొదట రూ.నాలుగు లక్షలు తన ఖాతాలో జమ చేసుకున్నది వాస్తవమేనన్నారు. ఆ తర్వాత మిగతా సభ్యుల ఖాతాలకు బదిలీ చేశానన్నారు. ఆరుగురు సభ్యులు తమ రుణబకాయి కిస్తులను 11 నెలలుగా సరిగా చెల్లించ లేదన్నారు. ఎప్పటికప్పుడు ఇవ్వాలని అడిగినందుకు తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సీఓ వరలక్ష్మిని వివరణ కోరగా క్రాంతి మహిళా సంఘంలో రెండు గ్రూపులు గా విడిపోయి ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నందున రద్దు చేశామన్నారు. ఇక ముందు ఈ సంఘం పేరిట ఏ బ్యాంకులోనూ రుణం తీసుకునేందుకు అవకాశం లేదన్నారు.

మాచారంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

జడ్చర్ల: మండలంలోని మాచారంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్ల పనులను శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఎంపీ డీకే అరుణ సీసీరోడ్లకు రూ.50 లక్షల నిధులు కేటాయించినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. బాలవర్ధన్‌గౌడ్, రమేష్, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్, శివశంకర్‌రెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

అమ్మకం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)కి చెందిన 400 ఎకరాల భూమిని ప్రభుత్వం అమ్మకానికి పెట్టడాన్ని వెనక్కి తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పీయూలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వచ్చి రాగానే విద్యారంగాన్ని నాశనం చేసే పనిలో ఉందన్నారు. భూముల అమ్మకం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్త నిరసనలు చేపడతామని హెచ్చరించారు. కృష్ణకుమార్, వేణుగోపాల్, రవితేజ, తిరుమలేష్ పాల్గొన్నారు.

తుంపర సేద్యంతో అధిక లాభాలు

మహమ్మదాబాద్: తుంపర సేద్యంతో అధిక లాభాలు, పంట దిగుబడులు సాధించొచ్చని హార్టికల్చర్ అధికారి స్వప్న తెలిపారు. శుక్రవారం మండలంలోని గాధిర్యాల్‌లో 30మందికి, నంచర్లలో 4మంది రైతులకు స్ప్రింకర్ల పైప్‌సెట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయం కోసం నీటిని అధికంగా వినియోగించకుండా ఎత్తుపల్లాల్లో ఉన్న భూములకు కూడా సాగునీరు అందించేలా వినియోగించుకోవచ్చని తెలిపారు

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం జెడ్పీ కార్యాలయం సమీపంలోని శ్రీద్వారకామాయి బాబా మందిరం సప్తమదశ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. కాగడహారతి, అమ్మవారులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. అదే విధంగా నవగ్రహ, పాశుపత హోమం, ప్రదోషకాల పూజ, సంధ్యాహారతి పూజలు చేశారు.

ఎంవీఎస్‌లో ‘వికసిత భారత్’

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో వికసిత భారత్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ -2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో వివిధ కళాశాలలకు చెందిన 134 మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని 3 నిమిషాల పాటు దేశం, అభివృద్ధి, సమైఖ్యత తదితర అంశాలపై స్పీచ్ ఇచ్చారు. ప్రిన్సిపాల్ పద్మావతి, టైటస్ పాల్, కోటానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రెడ్డి సేవా సమితి వార్షికోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు రెడ్డి సేవా సమితి 23వ వార్షికోత్సవాన్ని ఈనెల 23న జిల్లా కేంద్రంలోని రాజబహదూర్ రెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు రెడ్డి సేవా సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తూము ఇంద్రసేనారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ వార్షికోత్సవానికి ఎంపీ డీకే అరుణ, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ.జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఇతర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. వార్షికోత్సవంలో ఉమ్మడి జిల్లాలోని రెడ్డిలు పాల్గొనాలని ఆయన కోరారు.

వనసేవక్‌కు సన్మానం

నవాబుపేట: మండలంలోని హాజిలాపూర్ నర్సరీని మంచిగా నిర్వహణ చేసినందుకు వనసేవక్ కొత్త నారాయణను మండల అధికారులు సన్మానించారు. శుక్రవారం మండలంలో కొనసాగుతున్న ఉపాధి పనులను, నర్సరీలను అధికారుల బృందం తనిఖీ చేసింది.ఈ సందర్భంగా హాజిలాపూర్ నర్సరీని పరిశీలించి వనసేవక్‌ను అభినందించారు. నర్సరీ నిర్వహణ ఇతరులకు ఆదర్శంగా ఉందని అందుకే వనసేవక్‌ను అభినందించామని అధికారులు వివరించారు. ఎంపీడీఓ జయరాంనాయక్, ఎంపీహెచ్ఓ బద్రునాయక్ పాల్గొన్నారు.